క్లుప్తంగా

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగంలో పని చేస్తున్న డాక్టర్ డి.మురళీకృష్ణ బీకాం, ఎంకాంలో వివిధ సబ్జెక్టులకు సంబంధించి పది పుస్తకాలను రచించడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. ఈ పుస్తకాలలో రెండింటిని సోమవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయుక్తంగా ఈ పుస్తకాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, రవి కుమార్, శ్రావణ్‌కుమార్, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఆరిలోవ యువకుడు



ప్రవీణ్

ఆరిలోవ: ఆరిలోవకు చెందిన ఓ యువకుడు సెంట్రల్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాడు. స్థానిక జ్యోతినగర్‌కు చెందిన అల్లంపల్లి ప్రవీణ్ విశాఖ అనిట్స్‌లో ట్రిపుల్ ఈ(ఈఈఈ) చదువుకున్నాడు. ప్రస్తుతం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ)–2023 పరీక్ష రాశాడు. దీనిలో ప్రవీణ్ సెంట్రల్ టాక్స్ అండ్ కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆర్డర్ కాపీ సోమవారం ప్రవీణ్‌కు రిజిస్టర్ పోస్టులో అందింది. ప్రవీణ్‌కు విశాఖ జోన్‌లో పోస్టింగ్ ఇచ్చినట్టు ఆర్డర్ కాపీలో పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీలో ఆల్ ఇండియా ఎస్సీ కేటగిరీలో రెండో ర్యాంక్ వచ్చినట్లు ఈ సందర్భంగా ప్రవీణ్ తెలిపారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో ఎస్సీ కేటగిరీలో ఒకటో ర్యాంక్ వచ్చిందన్నారు. దీంతో ప్రవీణ్ తల్లిదండ్రులు అల్లంపల్లి రాజబాబు, జ్యోతి ఆనందం వ్యక్తం చేశారు.

రైతుబజారు స్టాళ్లకు డ్రా



డ్రా తీసి టోకెన్ అందిస్తున్న రైతుబజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజారులోని రైతుల స్టాళ్లకు సోమవారం డ్రా తీశారు. ఉదయం రైతులు 89 మందికి 66 స్టాళ్లకు, సాయంత్రం రైతులు 55 మందికి 66 స్టాళ్లకు ఎస్టేట్ అధికారి కొండబాబు డ్రా తీసి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు పది రోజులకు స్టాళ్లకు డ్రా తీసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

విభజన హామీలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం



శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి, ప్రజలను మోసం చేసిన కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1096వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులతో పాటు గాజువాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు చెల్లుబోయిన నాయుడు, నాయకులు మాట్లాడుతూ రాష్ట్రాన్ని నష్టాల్లోకి నెట్టిన కేంద్రప్రభుత్వం వైఖరి మార్చుకోవాలన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా కాంగ్రెస్ మద్దతు తెలుపుతుందన్నారు.

విజయం కోసం.. అలుపెరగని పోరాటం

- ఏయూ మైదానంలో ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర పోటీలు



కబడ్డీలో తలపడుతున్న విశాఖ, అనకాపల్లి జట్లు



వాలీబాల్ ఫైనల్‌లో తలపడుతున్న కర్నూలు, బాపట్ల జట్లు

ఏయూ క్యాంపస్: విజయం కోసం క్రీడాకారులు శ్రమించారు. ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా నిర్వహిస్తున్న క్రీడాపోటీలు తుది అంకానికి చేరుకున్నాయి. సోమవారం ఏయూ మైదానాల్లో నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. వాలీబాల్ ఫైనల్ పోటీలో కర్నూలు, బాపట్లకు చెందిన బాలికల జట్లు పోటీ పడ్డాయి. అత్యుత్తమ క్రీడా స్ఫూర్తిని కనబరిచారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల బాలుర మధ్య జరిగిన కబడ్డీ పోటీ ఉత్కంఠభరితంగా జరిగింది. ప్రతి పాయింట్ సాధించడం ఎంతో ప్రతిష్టాత్మకంగా మారింది. మరోవైపు ఖోఖో పోటీలు అదే స్ఫూర్తితో సాగాయి. ఫైనల్ పోటీలు నిర్వహించే ఖోఖో, కబడ్డీ మైదానాలను ప్రత్యేకంగా మ్యాట్‌లతో తీర్చిదిద్దారు. ఆడుదాం ఆంధ్ర క్రీడలను వీక్షించడానికి ఏయూలో చదువుతున్న పలువురు విదేశీ విద్యార్థులు తరలివచ్చారు. క్రీడలను ఆస్వాదిస్తూ, క్రీడాకారులను ప్రోత్సహించారు.



కొత్త బూట్లతో క్రీడాకారులు



కాకినాడ, విజయనగరం జిల్లాల మధ్య ఖోఖో పోరు



ఫైనల్ కోసం సిద్ధం చేసిన మ్యాట్‌లు

విద్యా సమాచారమ్

ఏపీఎండీసీకి వర్సిటీ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎండీసీ) సంస్థలో ఉద్యోగాలకు ముగ్గురు ఏయూ విద్యార్థులు ఎంపికయ్యారు. ఏయూ ఎంహెచ్‌ఆర్ఎం కోర్సు చదువుతున్న ఎం.రవిశ్రీ కిరణ్, ఎం.ఎ.నూకరాజు, ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంట్ సైన్స్ కోర్సు చదువుతున్న కుంచె అపూర్వ ఏపీఎండీసీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి వార్షిక వేతనంగా రూ.8.4 లక్షలు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆచార్య జాలాది రవి, ఆచార్య అరుణ్ కుమార్, ఆర్ట్స్–కామర్స్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.మోహన్‌గణేష్, తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు 700 మందికిపైగా విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో ఎంపికయ్యారని ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.ఆర్.రెడ్డి తెలిపారు.

సైకాలజీ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం విద్యార్థులను వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల జరిగిన 28వ అంతర్జాతీయ, 59వ జాతీయ ఇండియన్ అకాడమీ ఆఫ్ అప్లయిడ్ సైకాలజీ సదస్సుల్లో పాల్గొని, పలు అవార్డులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి సదస్సుల్లో పాల్గొనడం వల్ల నూతన జ్ఞానాన్ని నిపుణుల నుంచి పొందడం సాధ్యపడుతుందన్నారు. శాస్త్ర సంబంధంగా జరుగుతున్న పరిశోధనలు, ఆవిష్కరణలను తెలుసుకోవడానికి ఇటువంటి సదస్సులు ఉపకరిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరని 'భారత్ దాల్'



భారత్ దాల్ ప్యాకెట్



సోమవారం రైతుబజార్‌కు చేరిన పప్పు బస్తాలు

ఏయూ క్యాంపస్: ప్రభుత్వం తక్కువ ధరకు ప్రజలకు నిత్యావసర సరకులు అందించాలనే బృహత్తర సంకల్పం పక్కదారి పడుతోంది. కొన్ని రైతుబజార్లలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో వినియోగదారులకు అందకుండా పోతున్నాయి. స్థానిక పెదవాల్తేరు రైతుబజార్‌కు కిలో రూ.60 చొప్పున విక్రయించాలని ఇటీవల 1500 కిలోల శనగ పప్పు(భారత్ దాల్) వచ్చింది. దీనిని రైతుబజార్‌లో దుకాణదారులు వినియోగదారులకు పూర్తిగా చేరకుండా భారీ సంఖ్యలో పక్కదారి పట్టించారనే ఆరోపణలు వస్తున్నాయి. పెదవాల్తేరు రైతుబజార్‌లో వినియోగదారుల వివరాలు నమోదు చేసుకోవడం, బహిరంగంగా విక్రయించడం నామమాత్రంగానే జరుపుతున్నారు. విషయం బయటకు పొక్కడంతో దుకాణదారులు నష్ట నివారణ చర్యలు ప్రారంభించారు. గతంలో ధరలు పెరిగిన నేపథ్యంలో ఉల్లిపాయలు, టమాటాల విక్రయాల సమయంలో అనుసరించిన పద్ధతుల్లో ప్రస్తుతం శనగపప్పు విక్రయించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా తాజాగా సోమవారం మరో 2000 కిలోల శనగపప్పు(భారత్ దాల్) రైతుబజార్‌కు చేరింది. ఈసారైనా విక్రయిస్తారా? లేదా బహిరంగ మార్కెట్‌కి తరలిస్తారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించి శనగపప్పును సక్రమంగా విక్రయించేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

బీచ్ రోడ్డు: పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్టు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భానోజీనగర్‌కు చెందిన వి.నాగ వెంకట సతీష్ సిరిపురంలోని ఫుడ్‌ఎక్స్ ఎదురుగా మధ్యాహ్నం 12:30 గంటలకు తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి లోపలికి వెళ్లాడు. తిరిగి 2:30 గంటల సమయంలో వచ్చి చూసే సరికి వాహనం కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సమస్యలు పరిష్కరించాలని గిరిజనుల వినతి



ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావుకు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

మహారాణిపేట: చినగదిలి మండలం సింహాచలం కొండపై నివసిస్తున్న గిరిజనులు, ప్రజా సంఘాల నాయకులు సోమవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావును కలిశారు. విజయనగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో చైర్మన్‌ను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఆయన ఈ సమస్యల ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.

ప్రజా రవాణాతో పర్యావరణ పరిరక్షణ



జీవీఎంసీ కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. ఆమె తమ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం తన చాంబర్‌లో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్)కు హాజరయ్యారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై వచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎకో–వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో నగరంలో పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ అనేక చర్యలు చేపడుతుందన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

సర్వశాస్త్ర విశారదుడు హనుమంతుడు



ప్రవచనాలు చెబుతున్న షణ్ముఖ శర్మ

ఎంవీపీ కాలనీ: సామవేదం షణ్ముఖశర్మ హనుమద్వైభవ ప్రవచనాలు ఎంవీపీ కాలనీలో సోమవారం కొనసాగాయి. స్థానిక ఏబీసీ పార్కు వేదికగా షణ్ముఖశర్మ హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో హనుమద్వైభవ ప్రవచనాలు కొద్ది రోజులుగా కేవీఎస్ శ్యామ్, అరుణ గాయత్రి దంపతుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ సర్వశాస్త్ర విశారదుడు హనుమంతుడు అని పేర్కొన్నారు. వేదాంత విద్యను ఎరిగిన వాడిగా, జ్ఞానంతో కూడిన ఉన్నత విలువలు కలిగిన వాడిగా ప్రసిద్ధి చెందాడన్నారు. రాగ ద్వేషాలకు అతీతంగా కర్తవ్యాన్ని ఆచరించగల సమర్థత హనుమంతుడి సొంతమన్నారు. అంతటి గొప్పతనం కలిగిన హనుమంతుడి కీర్తిని, జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ ఒడిసిపట్టడంతో పాటు పిల్లలకు తెలియజెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణతో పాటు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రవచనాలు అనంతరం భక్తులు పెద్ద ఎత్తున షణ్ముఖశర్మ ఆశీస్సులు తీసుకున్నారు.

మోదీకి తగ్గని ప్రజాదరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ జీవీఎల్, తదితరులు

ఎంవీపీ కాలనీ: పదేళ్ల సుదీర్ఘ పాలన తరువాత కూడా ప్రధాని మోదీకి దేశ ప్రజల ఆదరణ తగ్గలేదని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. సోమవారం సాయంత్రం లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15న విశాఖలో నీతి ఆయోగ్ సమావేశం జరగనుందని తెలిపారు. 282 మందికి ట్రైసైకిళ్ల పంపిణీ చేయడంతో పాటు పలు ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు ఉపకరణాలు అందజేస్తారన్నారు. దేశానికి విశిష్ట సేవలు అందించిన పీవీ నరసింహారావు, చౌదరి చరణ్‌సింగ్ వంటి వారికి భారతరత్న పురస్కారాలు అందజేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. ఖతార్‌లో ఉరి శిక్ష బారి నుంచి దేశ మాజీ సైనికులను కాపాడి తిరిగి దేశానికి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఇలా శిక్ష పడిన వారిలో విశాఖకు చెందిన సుగుణాకర్ అనే మాజీ అధికారి కూడా ఉన్నారన్నారు. ఈ నెల 15న జరిగే కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను జీవీఎల్ ఆవిష్కరించారు. పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురి అరెస్ట్

- ఆటోలో వెంబడించి వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ
- సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితుల గుర్తింపు



చిరుపాటి రాజు



చేపల ఆనంద్



కంబాల శ్రీ రాజు

అక్కిరెడ్డిపాలెం: వాకింగ్ చేస్తున్న వృద్ధురాలిని ఆటోలో వెంబడించి, ఆమె మెడలోని బంగారు గొలుసు, నగదు చోరీ చేసిన ముగ్గురు యువకులను గాజువాక పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఆ బంగారం కొనుగోలు చేసిన వ్యాపారిని కూడా అరెస్ట్ చేశారు. గాజువాక క్రైం సీఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీహరిపురానికి చెందిన షియా ప్రసాద్‌సింగ్ (84) గత నెల 24న గొందేశిపాలెంలో వాకింగ్ చేస్తుండగా.. పెదగంట్యాడకు చెందిన చేపల ఆనంద్, కంబాల శ్రీరాజు, హనుమంతవాకకు చెందిన చిరుపాటి రాజు ఆటోలో వెంబడించి ఆమె మెడలోని తులం బంగారు చైన్‌ను తెంచుకుపోవడంతోపాటు, ఆమె వద్ద గల నగదును కూడా లాక్కుని పరారయ్యారు. ఆమె వెంటనే గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి.. సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా దొంగల ఆచూకీని కనిపెట్టారు. విచారణలో ముగ్గురూ నేరం చేసినట్లు తేలడంతో, సోమవారం వారిని అరెస్ట్ చేసి, బంగారం, నగదుతో పాటు మద్యం సీసాలు, ఇనుప రాడ్డు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన బంగారాన్ని కొనుగోలు చేసిన దిగువ జాలారిపేటకు చెందిన సీహెచ్ ఎల్లాజీ (35)ని కూడా అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ క్రైం డీసీపీ వెంకటరత్నం, క్రైం ఏడీసీపీ గంగాధరం, జోన్–2 క్రైం ఏసీపీ సునీల్ ఆధ్వర్యంలో ఎస్ఐ మన్మధరావు, ఏఎస్ఐ రవి, కానిస్టేబుళ్లు కేసు దర్యాప్తు చేసి, నిందితులను గుర్తించగలిగారన్నారు. నిందితుల్లో ఒకరు పాత నేరస్తుడని తెలిపారు. ఆటో నంబర్ ప్లేట్ సరిగ్గా లేకపోయినా, పాతకేసును తిరగదోడి నిందితులను గుర్తించారని, సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా వారిని పట్టుకోగలిగారని తెలియజేశారు.

అద్దంలా బీచ్ రోడ్డు



సీతకొండ మలుపు వద్ద డబుల్ రోడ్డు(నేడు)



సీతకొండ మలుపు వద్ద పాత రోడ్డు(నాడు)



సీతకొండ మలుపు నుంచి వైఎస్సార్ సీ వ్యూ వైపు కొత్త రోడ్డు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో రహదారులకు మహర్దశ వచ్చింది. ఆధునికీకరణతో నూతన శోభను సంతరించుకున్నాయి. అందమైన రహదారులు వాహనచోదకులకు కనువిందు చేస్తున్నాయి. సీతకొండ పరిసరాలలో ఇటీవల నిర్మించిన రోడ్డు ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. దీంతో పాటు నియోజకవర్గంలో జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్లకు కొత్తరూపును తీసుకొచ్చారు. వైఎస్సార్‌సీ ప్రభుత్వం వచ్చిన నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. బీఆర్‌టీఎస్ చినగదిలి సాయిబాబా ఆలయం కూడలి నుంచి సూర్యతేజానగర్ వరకు, జాతీయ రహదారి హనుమంతవాక కూడలి నుంచి విశాలాక్షినగర్ కైలాసగిరి కూడలి వరకు, బీచ్‌రోడ్డులో సీతకొండ మలుపు నుంచి చివర వరకు, జాతీయ రహదారి విశాఖ వ్యాలీ కూడలి నుంచి సీతకొండ చివర బీచ్‌రోడ్‌ వరకు రోడ్ల నిర్మాణం, విస్తరణ చేపట్టారు.

సీతకొండ వద్ద పూర్తయిన విస్తరణ

వీఎంఆర్‌డీఏ అధికారులు సీతకొండ వద్ద బీచ్‌రోడ్డును విస్తరించారు. వైఎస్సార్ సీ వ్యూ పాయింట్ నుంచి సీతకొండ చివర వరకు సుమారు 400 మీటర్ల పొడవున ఇరుకుగా ఉండే 30 అడుగుల రోడ్డును 80 అడుగులకు విస్తరించారు. దీని కోసం సుమారు రూ.4 కోట్లు ఖర్చు చేశారు. దీంతో భీమిలి, రుషికొండ, సాగర్‌నగర్ ప్రాంతాల నుంచి నగరానికి నిత్యం తిరిగే వాహనాల రద్దీతో ఉండే ఈ రోడ్డుకు ఇప్పుడు మోక్షం కలిగింది. ఈ మార్గంలో అతి ప్రమాదకరమైన రెండు పెద్ద మలుపుల వద్ద డబుల్ రోడ్డు సిద్ధమైంది. సెంట్రల్ లైటింగ్, ఇరుపక్కలా పాత్‌వేలు, పచ్చదనంతో దీన్ని ఆధునికీకరించారు. దశాబ్దాలుగా నెరవేరని ఈ రోడ్డు విస్తరణ ఎట్టకేలకు పూర్తి కావడంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లకు రంగు రంగుల పలకలు అమర్చడంతో ఆకట్టుకుంటున్నాయి. గోడలకు నలుపు, తెలుపు చారలతో పెయింటింగ్ వేశారు. దీంతో ఈ రోడ్డు సుందరంగా దర్శనమిస్తోందని వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

15న జాబ్‌మేళా

కంచరపాలెం : స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 15న గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టల శ్యామ్ సుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హీరో మోటో, డైకిన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 100 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని తెలిపారు. ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, డిప్లమో, ఎంబీఏ ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. విశాఖపట్నంలో ఉద్యోగం చేయాలని, నెలకు రూ.13,450 నుంచి రూ.18,350 జీతం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. కంచరపాలెంలో గల జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో గురువారం ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



వసంత బాల స్కూల్‌లో పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ముకేష్‌కుమార్‌మీనా, కలెక్టర్ మల్లికార్జున, ఇతర అధికారులు

సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధి లోని పలు పోలింగ్ స్టేషన్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా సోమవారం పరిశీలించారు. జీవీఎంసీ 24వ వార్డు గురుద్వార్ దరి వసంత బాల స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునతో కలిసి ఆయన పరిశీలించారు. అక్కడ కల్పించిన వసతులపై ఆరా తీశారు. అన్ని చోట్ల వికలాంగులు సులభంగా పోలింగ్ కేంద్రం లోపలకు చేరుకునేందుకు అనువుగా ర్యాంపులు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, ఫ్యాన్లు, ఇతర వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా వసతులు కల్పించాలని, పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనతోపాటు ప్రత్యేక ఉప కలెక్టర్ డి.అఖిల, తహసీల్దార్ శ్రీరామమూర్తి, బీఎల్వోలు, ఇతర అధికారులు ఉన్నారు.